ఆంధ్రజ్యోతి

andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4, కనిష్ఠం 13.9



నిజామాబాద్
జిల్లా వార్తలు

5 ఆదివారం 30 నవంబరు 2025

ఎన్నికలు ముగిసే వరకు 'ప్రజావాణి' రద్దు

ఇందూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం కొనసాగనుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ప్రకటనలో కోరారు.



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపుతున్న ప్రశాంత్‌రెడ్డి

రేవంత్‌రెడ్డి నుంచి తెలంగాణను కాపాడుకోవాలి

- తెలంగాణ ఉద్యమ సమయంలో మహేష్‌కుమార్‌గౌడ్ ఎక్కడున్నాడు
- కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఆయనకు లేదు
- కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ రాష్ట్ర ప్రకటన
- దీక్షాదివస్‌లో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను తెలంగాణ మీదకు దండయాత్ర చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువస్తున్నారని ఆయన నుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన అవసరముందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటులో కేసీఆర్

మిగతా 8వ పేజీలో...

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- కార్యకర్తలు విజయమే లక్ష్యంగా పనిచేయాలి
- వచ్చేనెల 1న బాధ్యతలు స్వీకరిస్తా
- డీసీసీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్‌రెడ్డి

8



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి



మహిళల చేతుల్లోనే గెలుపు కీ

- 'స్థానిక' ఎన్నికల్లో జిల్లాలో మహిళా ఓటర్లే అధికం
- మహిళా ఓటర్ల కోసం ఆశావహుల ప్రదక్షిణలు
- జిల్లాలో 4.54లక్షల మహిళా ఓటర్లు
- రిజర్వేషన్లలోనూ వారికే అగ్రస్థానం
- మహిళలకే అధిక సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు

"స్థానిక ఎన్నికల్లో మొత్తం ఫోకస్ మహిళలపైనే ఉంది. జిల్లాలో ప్రతి పంచాయతీ, ప్రతి వార్డు గెలుపోటములూ వారి పైనే ఆధారపడి ఉన్నాయి. నిర్ణయాక శక్తి వారే కావడంతో ఆశావహులంతా వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 8.51 లక్షల మొత్తం ఓటర్లలో 4.54 లక్షల మహిళలు ఉండటంతో రాజకీయ పార్టీ లెక్కలు తారుమారయ్యే అవకాశం ఉంది. రిజర్వేషన్లలోనూ మహిళలకే అత్యధిక సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల కేటాయింపుతో పోటీ వాతావరణం మరో స్థాయికి చేరింది. మూడు విడతలుగా జరుగనున్న పోలింగ్‌లో ప్రతి విడతలోనూ మహిళా ఓటర్లే మెజారిటీగా ఉండటం అభ్యర్థులకు ఆశ, ఆందోళనకు గురి చేస్తోంది. "మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకుంటే గెలుపు ఖాయం" అనే భావనతో ప్రతి నాయకుడు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మొత్తంగా ఈ పంచాయతీ పోరులో 'ఆమె ఓటు' విజయాన్ని నిర్ణయించే బ్రహ్మాస్త్రంగా మారింది.

నిజామాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రస్తుతం స్థానిక సంస్థల రాజకీయాలన్ని మహిళల చుట్టే తిరుగుతున్నాయి. జిల్లాలో 545 గ్రామ పంచాయతీలు, 5022 వార్డులకు గాను 3 విడతల్లో జరగనున్న ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. గ్రామ పంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికల గెలుపోటములలో మహిళలే కీలకం కానుండగా వారి చుట్టూ పోటీలో ఉన్న ఆశావహులు తిరిగే పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలో మొత్తం ఓటర్లు 8లక్షల 51వేల 417 మంది ఉండగా అందులో మహిళా ఓటర్లు 4లక్షల 54వేల 621 మంది, పురుష ఓటర్లు 3లక్షల 96వేల 778 మంది, ఇతరులు 18 మంది ఉన్నారు. ఇప్పటి వరకు జరిగిన శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు మహిళ ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపితే అటువైపే ఫలితం రాగా స్థానిక ఎన్నికల్లో సైతం వారి ఓట్లే కీలకం కానున్నాయి. పోలింగ్ అయ్యే ఓట్లు సైతం మహిళలే ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో పంచాయతీ ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించేది మహిళలే అనేది అక్షరసత్యం. సర్పంచ్ స్థానాలలో మొత్తం 545 స్థానాలకు 244 స్థానాలు మహిళలకే దక్కాయి. 5022 వార్డు సభ్యులకు గాను మహిళలకే 2152 స్థానాలు దక్కాయి.

అందరిచూపు మహిళలవైపే..

జిల్లాలో మూడు విడతల్లో జరగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో 3 చోట్ల మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు. డిసెంబరు 11న జరిగే మొదటి విడత ఎన్నికల్లో మొత్తం 2లక్షల 61వేల 210 ఓటర్లు ఉండగా అందులో లక్షా 37వేల 413 మంది మహిళా ఓటర్లే ఉన్నారు. డిసెంబరు 14న జరగనున్న 2వ విడత ఎన్నికల్లోను మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మొత్తం 2లక్షల 64వేల 178 ఓటర్లు ఉండగా మహిళా ఓటర్లు 1లక్షల 41వేల 305 మంది ఉన్నారు. డిసెంబరు 17న జరగనున్న 3వ విడత ఎన్నికల్లోను మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు. మొత్తం 3లక్షల 26వేల 29 మంది ఓటర్లు ఉండగా లక్ష 75వేల 903 మంది మహిళ ఓటర్లే ఉన్నారు.

మహిళలకే అత్యధిక స్థానాల కేటాయింపు

స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50శాతం సీట్లను కేటాయించడంతో ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాలలో మహిళలకు పోటీచేసే అవకాశం దక్కింది. గతంతో పోలిస్తే ఈ సారి

(మిగతా 8వ పేజీలో...)

ముగిసిన మొదటివిడత..

- భారీగా నమోదైన నామినేషన్ పత్రాలు
- నేటి నుంచి రెండో విడత స్వీకరణ షురూ

నిజామాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గ్రామ పంచాయతీ, వార్డు సభ్యుల మొదటి విడత నామినేషన్‌ల ప్రక్రియ శనివారం ముగిసింది. శనివారం సాయంత్రం 5గంటల వరకు గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్‌లను అధికారులు స్వీకరించారు. మొదటి విడత ఎన్నికలు జరగనున్న 184 సర్పంచ్, 1,642 వార్డు సభ్యుల స్థానాలకు శనివారం నామినేషన్‌లకు చివరి రోజు కావడంతో భారీ సంఖ్యలో ఆశావహులు నామినేషన్‌లు దాఖలు చేశారు. నామినేషన్‌ల సమయం ముగిసేలోగా వచ్చిన అభ్యర్థుల నామినేషన్‌లను అధికారులు స్వీకరించారు. గురు, శుక్రవారాలలో మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న 184 సర్పంచ్ స్థానాలకు 304 నామినేషన్‌లు దాఖలు

మిగతా 8వ పేజీలో...

ఉమ్మడి జిల్లాలో ఎకరానికి కూడా కాళేశ్వరం నీళ్లు ఇవ్వలే

- ఎస్సారెస్పీ 'పునరుజ్జీవం' ఇరిగేషన్ చరిత్రలో అత్యంత అవినీతి మయం
- జాగృతి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌రెడ్డి

8

తీరు మారదు.. దారి మార్చరు

- అర్ధాంతరంగా మోర్తాడ్- చౌట్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు
- మూడేళ్లుగా ప్రయాణికులకు తప్పని అవస్థలు

6



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, చిత్రంలో జిల్లా అధికారులు

మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

- ఆర్‌వోలు, ఏఆర్‌వో శిక్షణలో కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ఎలక్షన్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియం ఆర్‌వోలు, ఏఆర్‌వోలకు పంచాయతీ ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులపై పునఃశ్చరణ కల్పించేందుకు శనివారం శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చట్టబద్ధతతో కూడిన ఎన్నికల విధులను ఎంతో జాగ్రత్తగా నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం ద్వారా అందించబడిన హ్యాండ్ బుక్ (కర దీపిక)ను చదువుకుని ఈసీ మార్గదర్శకాల మేరకు సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ కోసం అభ్యర్థులు కాకుండా, వారి తరఫున ప్రతిపాదకులు వచ్చిన సమయంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే ఉపసంహరణకు అనుమతించాలని కలెక్టర్ సూచించారు. ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన మీదట బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా రూపొందించాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులతో పాటు "నోటా" సింబల్‌ను కూడా తప్పనిసరిగా చేర్చాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ తరగతుల్లో జిల్లా పంచాయతీ అధికారి డి.శ్రీనివాస్ రావు, డీఎల్పీవో శ్రీనివాస్, ఆర్‌వోలు, సహాయ ఆర్‌వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బలవంతపు ఏకగ్రీవాలకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరైనా బలవంతపు ఏకగ్రీవాలకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధి కారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నూతన మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. సమష్టి నిర్ణయం ద్వారా సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే అది ఆహ్వానించదగ్గ పరిణామం అని అన్నారు. అయితే అందుకు భిన్నంగా డబ్బుల ప్రలోభాలు చూపి, భయ భ్రాం తులకు గురి చేసి బలవంతంగా ఏక గ్రీవాలు చేయించే ప్రయత్నాలను ఎంత మాత్రం ఉపేక్షించబోమని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి హెచ్చరించారు.



• జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయం



అయ్యప్ప స్వామి మూలవిగ్రహం

సూర్యోదయానికి పూర్వమే చన్నీటి స్నానం.. ఆధ్యాత్మిక పలకరింపు.. ఒంటిపూట భోజనం.. సాయంత్రం అయ్యేసరికి చన్నీటి స్నానం.. సన్నిధానంలో పూజ.. కటిక నేలపై పడుకోవడం.. వంటి కఠిన నియమాలతో స్వాములు అయ్యప్పను పూజిస్తారు. అయ్యప్పస్వామిని భక్తిశ్రద్ధలతో పూజించడానికి అనుసరించే 41 రోజుల దివ్య అయ్యప్ప దీక్షా వ్రతం. దీక్షా సమయంలో నిత్యం స్వామి చింతనలో ఉంటూ శరణం అయ్యప్ప అంటూ.. అయ్యప్ప నామస్మరణలో ఉంటారు.

మాలధారణం.. నియమాల తోరణం..

- నియమనిష్ఠలతో అయ్యప్ప దీక్షా స్వాములు
- మండల దీక్షను స్వీకరిస్తున్న భక్తులు
- పడిపూజలతో భక్తిని చాటుకుంటున్న అయ్యప్పలు

నిజామాబాద్‌కల్చరల్/బోధన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా కార్తీకమాసం మొదలుకొని మార్గశిర పుష్యమాసం వరకు మూడు నెలల పాటు భక్తులు అయ్యప్ప దీక్షను స్వీకరిస్తారు. మండల రోజుల పాటు కఠిన నియమాలతో స్వామిని పూజించడం వల్ల అయ్యప్ప అనుగ్రహం లభిస్తుందని భక్తులు భావిస్తారు. దీక్షా కాలంలో తప్పనిసరిగా బ్రహ్మచర్యం పాటించి యోగివలే జీవించాలి అనే భావనతో భక్తులు జీవనాన్ని కొనసాగిస్తారు. సాత్విక మిత ఆహారం స్వీకరించడం, మితంగా మాట్లాడటం, దేవాలయాలను సందర్శించడం వంటి నియమాలను పాటిస్తారు. సాయంత్రం సూర్యాస్తమం తర్వాత చల్లనీటి స్నానం చేసి సన్నిధానంలో దీక్షామంత్రం పఠించడం అయ్యప్పను పూజించడం దీక్షలో భాగంగా భావిస్తారు.

మండల దీక్షను స్వీకరిస్తున్న భక్తులు..

స్వామియే శరణం అయ్యప్ప అంటూ భక్తులు అయ్యప్ప స్వామిని స్మరిస్తూ దీక్షలను స్వీకరిస్తారు. నవంబరు, డిసెంబరు వరకు మండల దీక్షలు కొనసాగుతాయి. మకరజ్యోతి దర్శనం

మిగతా 8వ పేజీలో...

27 ఏళ్లుగా దీక్షను స్వీకరిస్తున్నా..

: దాత్రిక రతన్, పాదయాత్ర స్వామి



అయ్యప్ప స్వామి మీద అచెంచెల భక్తితో గత 27 ఏళ్లుగా దీక్షను స్వీకరిస్తున్నాను. మొట్టమొదటి సారిగా శబరిమలకు పాదయాత్రగా భక్తుల మంతా కలిసి వెళ్లడం గొప్ప అనుభూతిని ఇచ్చింది. ఐదుసార్లు శబరిమలకు పాదయాత్రకు వెళ్లగా ఒకసారి కాశీ నుంచి రామేశ్వరం వరకు అయ్యప్ప దీక్షలో పాదయాత్ర చేశాను.

కఠిన నియమాలతో స్వామిని పూజిస్తాం..

: వినయ్ గుర్రం, గద స్వామి



కఠిన నియమాలతో స్వామిని పూజిస్తాం. ఆధ్యాత్మిక చింతనలో గడుపుతాం. స్వామి అనుగ్రహంతో ఆయురారోగ్యాలతో కుటుంబం ఆనందంగా ఉంది. 41 రోజులు మండల దీక్షను నియమనిష్ఠలతో పాటించి ఇరుముడితో శబరిమలైకి వెళ్తాం. దీక్షను స్వీకరించడం నాలుగోసారి.

జిల్లా కోర్టులో స్కానింగ్ సెంటర్

- ప్రారంభించిన హైకోర్టు జస్టిస్, జిల్లా ఇన్‌చార్జి అడ్మినిస్ట్రేటివ్ జడ్జి టి.మాధవి దేవి



స్కానింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు జస్టిస్

నిజామాబాద్ లీగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు జస్టిస్, జిల్లా ఇన్‌చార్జి అడ్మినిస్ట్రేటివ్ జడ్జి టి.మాధవి దేవి శనివారం జిల్లా పర్యటనకు వచ్చారు. స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. హైకోర్టు న్యాయమూర్తిని జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పోలీసు కమిషనర్ సాయి చైతన్య ఘనంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె బాసరలోని సరస్వతి ఆలయాన్ని దర్శించుకుని తిరిగి జిల్లా కోర్టుకు చేరుకున్నారు. కోర్టు భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్యుమెంట్ స్కానింగ్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. అన్ని డాక్యుమెంట్లు స్కానింగ్ పూర్తయ్యాక కోర్టు విచారణలో అవసరమైన పత్రాలను చూడటం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. తర్వాత జిల్లా బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. అధ్యక్షుడు మామిళ్ల సాయిరెడ్డి మాట్లాడుతూ.. కోర్టులో కార్ పార్కింగ్ సమస్య, సీనియర్ సివిల్ జడ్జి పోస్టు ఖాళీగా ఉండటం తదితర సమ స్యలను వివరించారు. జిల్లా న్యాయాధికారి జీవీఎన్ భరతలక్ష్మి మాట్లాడుతూ, జిల్లా కోర్టులో స్కానింగ్ సెంటర్ ప్రారంభించడం ఎంతో సంతో షకరం అని అన్నారు. అనంతరం రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి మాట్లాడుతూ.. బార్ అండ్ బెంచ్ సమన్వయా నికి జిల్లా న్యాయవాదులు ఎల్లవేళలా ముందుం టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి మాణి క్ రాజు, అదనపు జిల్లా జడ్జిలు శ్రీని వాస్, హరీ ష్, సీనియర్ సివిల్ జడ్జి పి.సాయి సుధ, జూని యర్ సివిల్ జడ్జి గోపి కృష్ణ, జాయింట్ సెక్రటరీ ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

వైభవంగా రుషితుల్య మహాపడి పూజ

- అయ్యప్ప నామస్మరణతో మారుమోగిన ధర్మారం



పూజలు నిర్వహిస్తున్న స్వాములు

ఇందూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం గ్రామం శనివారం భక్తిరసంతో నిండిపోయింది. అయ్యప్ప స్వామి భక్తులు నిర్వహించిన రుషితుల్యమహాపడి పూజ ఆ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పారవశ్యంలో ముంచేసింది. గురుస్వామి పోలినేని పెద బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాకార్య క్రమం భక్తులను ఆకర్షించింది. పూజా కార్యక్రమాలను పురోహితుడు అల్లాడి శ్రీనివాస్ వేదోచ్చారణల మధ్య పర్యవేక్షించారు. ఇందల్వాయి, సిరికొండ, ధర్పల్లి, డిచ్‌పల్లి, నిజామాబాద్ ప్రాంతాల నుంచి సుమారు 400 మంది అయ్యప్ప మాలధారులు, 600 మంది భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. స్వామియే శరణం అయ్యప్ప నినాదాలు ధర్మారంలో మారుమోగించాయి. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పి. శ్రీనివాస్, పి. సురేష్, గంగారెడ్డి, వెంకటరమణ, శేఖర్, రమణ, ఎస్. నరేష్ పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నరేష్ (ఫైల్)

రాజంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాయిపల్లి గ్రామానికి చెంది న గజ్జెల నరేష్ గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. శుక్రవారం రాత్రి నరేష్ కామారెడ్డికి వెళ్తుండగా గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్క డే మృతిచెందాడన్నారు. మృతుని తల్లి నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అక్రమంగా ఇసుక తరలింపు.. ట్రాక్టర్ సీజ్

ముప్కాల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని వన్నెల్ (బి) గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై శైలేందర్ తెలిపారు. శనివారం ఉదయం శెట్‌పల్లి గ్రామానికి చంఎదిన బాబ్బురి నరేష్ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను వన్నెల్(బి) శివార్లో పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమానితో పాటు అక్రమ రవాణాకు సహకరిస్తున్న గురిజాల నర్సయ్యపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా ఎవరైనా ఇసుక తరలింపు చేపడితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

వార్డు రిజర్వేషన్ మార్చారంటూ ఆందోళన


మంగల్‌పాడ్ గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఎడపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో నామినేషన్ కేంద్రం వద్ద గ్రామానికి చెందిన 3వ వార్డు సభ్యులు, గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. 3వ వార్డు ఎస్సీ రిజర్వేషన్ ఉంటే బీసీ అంటూ నామినేషన్‌ను తిరస్కరించారని ఆరోపించారు. ఈ విషయంపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయ్‌కుమార్ వివరణ ఇస్తూ నామినేషన్ కేంద్రం వద్ద సర్పంచ్, వార్డుసభ్యుల రిజర్వేషన్ల లిస్టును గోడకు అతికించామని, 3వ వార్డు బీసీకి రిజర్వు అయిందన్నారు. అందువల్ల ఎస్సీ అభ్యర్థులు నామినేషన్ వేయగా తిరస్కరించామన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన లిస్టు ఆధారంగా వారు ఎస్సీ రిజర్వ్ స్థానం ఉందంటున్నారని తెలియజేశారు. నామినేషన్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును ఎస్సై రమ ఏర్పాటుచేశారు.

నామినేషన్లను పరిశీలించిన ఎన్నికల అధికారి


వివరాలు తెలుసుకుంటున్న అధికారి

వర్ని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలంలో శనివారం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు జీ.వీ. శ్యాంప్రసాద్ లాల్ పర్యటించారు. మండల కార్యాలయాలతో పాటు ఆయా గ్రామ పంచాయతీలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల నియామక ప్రక్రియను అధికారులకు వివరించారు. తహసీల్దార్ సాయిలు, ఎంపీడీవో వెంకటేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తీరు మారదు.. దారి మార్చరు

● అర్ధాంతరంగా మోర్తాడ్- చౌట్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు ● మూడేళ్లుగా ఇదే ప్రయాణికులకు అవస్థలు


మోర్తాడ్- వడ్యాట్ రహదారిపై కంకర వేసి నిలిచిపోయిన పనులు

మోర్తాడ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ అభివృద్ధి పనులపై గ్రామాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఈ ఎన్నికలు పూర్తయ్యాకనైనా ఈ పనులు పూర్తవుతాయననే నమ్మకంతో ప్రజలు ఉన్నారు.

7 కిలోమీటర్ల మేర..

మోర్తాడ్, వడ్యాట్ మీదుగా చౌట్‌పల్లి వరకు రహదారి విస్తరణ పనులు మూడేళ్ల క్రితం ప్రారంభం కాగా అర్ధంతరంగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మోర్తాడ్ నుంచి వడ్యాట్, చౌట్‌పల్లి వరకు 7 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను పూర్తిచేసేందుకు రూ.6.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాగా గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేసిన వేముల ప్రశాంత్‌రెడ్డి అట్టహాసంగా పనులకు శంకుస్థాపన చేశారు. కాగా ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదు. రోడ్డుకు ఇరువైపులా కంకర వేశారు. కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపివేశారు. చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడంతో మధ్యలోనే పనులు ఆపివేశారని గ్రామస్థులు అంటున్నారు. దీంతో అధికారులు కూడా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేయలేకపోతున్నారని అంటున్నారు.

అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇరువైపులా కంకర వేసి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి ప్రజల సౌకర్యం కోసం రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

పనులు వెంటనే పూర్తిచేయాలి



మోర్తాడ్ నుంచి వడ్యాట్ రోడ్డుకు ఇరువైపులా కంకర ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుంది. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి.

- గంగుల్ల నవీన్, వడ్యాట్

కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుంది


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

భీమ్‌గల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా స్థానిక సంస్థల ఎన్నికలలో రాజకీయ లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ ఇందిరమ్మ చీరలు, మహిళా వడ్డీ రాయితీ రుణాల పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని భీమ్‌గల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో ఆడపిల్లల పెళ్లిళ్లకు ఇస్తామన్న తులం బంగారం, వృద్ధులకు రూ.4వేల పెన్షన్, వికలాంగులకు రూ.6వేల పెన్షన్, ప్రతి మహిళకు రూ.2500 పెన్షన్, చదువుకునే పిల్లలకు 5 లక్షల విద్య భరోసా ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇవేవి తెలియని కో-ఆపరేటివ్ యూనియన్ కార్పోరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. నాయకులు భరత్, నర్సయ్య, ప్రసాద్, నాయక్, మహమ్మద్ ఇక్రమ్, పార్టీ యువ నాయకులు రామ్ చందర్‌గౌడ్, శ్రీనివాస్, రాజు, రామకృష్ణ, దీక్షిత్ పాల్గొన్నారు.

నామినేషన్‌ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

జక్రాన్‌పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండలంలో ఆదివారం నుంచి సర్పంచ్‌లు, వార్డు స్థానాల నామినేషన్‌ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తిచేశామని, 7 క్లస్టరక్లా ఏర్పాటుచేసి నామినేషన్‌లను స్వీకరిస్తామని ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎంపీవో యూసుఫ్‌కాన్ శనివారం తెలిపారు. అర్గుల్ క్లస్టర్ పరిధిలో అర్గుల్, నారాయణపేట్, బ్రాహ్మణ్‌పల్లి, కొలిప్యాక్ క్లస్టర్ పరిధిలో కొలిప్యాక్, తొర్లికొండ, మనోహరాబాద్, పడకల్ క్లస్టర్ పరిధిలో పడకల్, చింతలూర్, కలిగోట్, జక్రాన్‌పల్లి క్లస్టర్ పరిధిలో జక్రాన్‌పల్లి, వివేక్‌నగర్ తాండ, చందమియ బానుతాండ, కేశ్‌పల్లి క్లస్టర్ పరిధిలో కేశ్‌పల్లి, బాలనగర్, సికింద్రపూర్, పుప్పాలపల్లి క్లస్టర్ పరిధిలో పుప్పాలపల్లి, మాదాపూర్, గన్యతాండ, మునిపల్లి క్లస్టర్ పరిధిలో మునిపల్లి, నల్లగుట్ట తాండ, లక్ష్మాపూర్ గ్రామాల సర్పంచ్‌లు, వార్డు స్థానాలకు నామినేషన్‌లను స్వీకరిస్తామని సర్పంచ్ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులు, వార్డు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఈ క్లస్టర్‌ల వారిగా నామినేషన్‌లు వేసుకోవాలని అన్నారు.

నేటి నుంచి పచ్చల నడ్కుడ మల్లన్న జాతర


జాతరకు ముస్తాబైన ఆలయం

వేల్పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలో ఆదివారం నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. 3 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తులు, ప్రజల సౌకర్యార్థం వీడీసీ సభ్యులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం గ్రామ రామాలయం నుంచి రథాన్ని జాతర జరిగే కొమురెల్లి మల్లన్న ఆలయం వరకు భక్తులు, ప్రజలు తాళ్ల సాయంతో లాగుతూ తీసుకెళ్తారు. సోమవారం మధ్యాహ్నం జాతర రథోత్సవం నిర్వహిస్తారు. మంగళవారం మల్లన్న స్వామికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి


శిక్షణ ఇస్తున్న డీఎల్‌పీవో శివకృష్ణ

ఆర్మూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయితీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్లు అంకిత్, కిరణ్ అన్నారు. ఆర్మూర్ లో శనివారం పంచాయితీ స్టేజ్-1, స్టేజ్ రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. శిక్షణ కార్యక్రమంలో డీఎల్‌పీవో శివకృష్ణ అధికారులకు ఎన్నికల సమయంలో చేపట్టవల్సిన విషయాలు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, అధికారులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ సందీప్

ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి

భీమ్‌గల్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవడానికి ప్రజలు సహకరించాలని భీమ్‌గల్ ఎస్ఐ సందీప్ సూచించారు. మండలంలోని ముచ్కూర్‌లో శనివారం గ్రామస్థులతో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకో వాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీవో సంతోష్‌తో కలిసి ముచ్కూర్, పల్లికొండలో పోలింగ్ కేంద్రాలకు సందర్శించి ఏర్పాట్లును పరిశీలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తొర్లికొండ విద్యార్థి


రాజు

భీమ్‌గల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బానోత్ రాజు ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు గంగమోహన్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ క్రీడా మైదానంలో ఆదివారం వరకు జరిగే 12వ రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బనోవత్ రాజు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి రాజును ఎంఈవో శ్రీనివాస్, వ్యాయమ ఉపాధ్యాయుడు గంగమోహన్, వీడీసీ చైర్మన్ ఎర్రోల్ల గంగాధర్, కార్యదర్శి చిక్కాల భూమేశ్వర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

● రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ పోటీలకు కలిగోట్ పూర్వ విద్యార్థులు వర్షిత్, పూజ, గంగోత్రి, సునాక్షి ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి శనివారం తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో శనివారం నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాడు పురుషోత్తమచారి, వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, విడిసి సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.


ఎంపికైన కలిగోట్ పూర్వ విద్యార్థులు

సీపీఆర్ఎం స్కూల్‌లో సైన్స్ ఫెయిర్


సైన్స్ ఫెయిర్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆలూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుత్ప సీపీఆర్ఎం స్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఇందులో భాగంగా 130 స్టాల్స్‌ను సుమారు 500 మంది విద్యార్థులు నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆలూర్ ఎంఈవో నరేందర్ హాజరై విద్యార్థిని, విద్యార్థులను అభినందంచారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రాస నిత్యానందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

3వ రోజు నామినేషన్ కేంద్రాల వద్ద సందడి

▸▸ సాయంత్రం 5 దాటిన చాలా మంది గేటు లోపలే


సాలూర నామినేషన్ సెంటర్ వద్ద అభ్యర్థుల సందడి

బోధన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్‌లో మూడవ రోజు ఎన్నికల నామినేషన్‌ల పర్వం ఊపందుకుంది. రెండవ రోజు అష్టమి కావడంతో సర్పంచ్, వార్డు సభ్యులకు నామినేషన్ వేయడానికి కొంతమంది వెనుకంజ వేశారు. మూడో రోజు శనివారం నవమి కావడంతో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ కేంద్రంలో బారులు తీరారు. ఉదయం నుండే నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులతో సందడి నెలకొంది. సాయంత్రం 5 దాటినా చాలా మంది సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యుల అభ్యర్థులు లోపలే బారులు తీరారు. సమయానికి లోపలికి వచ్చిన వారందరి నామినేషన్‌లు స్వీకరిస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. రాత్రి అవుతున్నప్పటికీ నామినేషన్‌ల పర్వం కొనసాగుతూనే ఉంది.

పోలీసుల బందోబస్తు

నామినేషన్‌ల ముగింపు సందర్భంగా కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎలక్షన్ కమిషన్ నిబంధన మేరకు సమయానుగుణంగా నామినేషన్‌ల వద్ద గేట్లను మూసి వేశారు. అభ్యర్థులు పూర్తి స్థాయిలో నామినేషన్ కేంద్రాల వద్దకు వచ్చారు. అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్‌లు వేశారు. శనివారం చివరి రోజు కావడంతో అభ్యర్థులు భారీ సంఖ్యలో నామినేషన్ కేంద్రాలకు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వరి కొయ్యల అవశేషాలు కాల్చడం వల్ల అపార నష్టాలు


కుకునూర్‌లో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

వేల్పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరి పంట కోసిన తర్వాత వరికొయ్యల అవ శేషాలు కాల్చడం ద్వారా అపారమైన నష్టాలు ఉంటాయని సుస్థిర కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామంలో రైతులకు వరికొయ్యలను కాల్చడం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు శివసాయి, సీఆర్‌పీ చింత శ్రీనివాస్‌లు మాట్లాడుతూ వరికొయ్యలను కాల్చడం వల్ల నైట్రోజన్, పాస్పరస్, పోటాషియం వంటి పోషకాలు ఆవిరైపోతాయని, భవిష్యత్తులో సాగుచేసే పంట భూమిలో అవి ఉండకుండా పోతాయన్నారు. అంతేకాకుండా కొయ్యల వ శేషాలు, కీటకాలు వ్యాధుల నివాసాలుగా మారుతాయని మట్టిలోని సూక్ష్మజీవాలు దెబ్బ తిని భూమి సంతులనం కోల్పోతుందన్నారు. మట్టిలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి భవిష్యత్తు పంటలకు ఎక్కువగా నీరు అందించే అవకాశం ఏర్పడుతుందన్నారు. దాంతో ఎరువుగా మారి భూసారాన్ని పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం శాస్త్రవేత్తలు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేష్, ఎర్రన్న, దినేష్, శ్రీకాంత్, రమేష్, దశరథ్, గోపి, సురేష్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్

అయోడిన్ ఉప్పును వాడాలి

▸▸ సాలూర మండల మెడికల్ ఆఫీసర్ రాజ్ కుమార్

సాలూర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలకు అయోడిన్ ఉప్పును వాడాలని సాలూర మండల మెడికల్ ఆఫీసర్ రాజ్ కుమార్ సూచించారు. శనివారం సాలూర మండలం ఎంపీయూపీఎస్ పాఠశాల విద్యార్థులకు అయోడిన్ ఉప్పు వాడకం వల్ల చేకూరే ప్రయోజనాలు అదే విధంగా పొగాకు తంబాకు లాంటి అలవాట్లు ఉన్న వారికి ఎలాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయో అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లలు అయోడిన్ ఉప్పును వాడినట్లయితే పిల్లలకు బుద్ధి మందగించకుండా చురుకుగా ఉంటారన్నారు. అదే విధంగా థైరాయిడ్ లాంటి వ్యాధులు సోకకుండా ఉంటుందన్నారు. పొగాకు తంబాకు పూర్తిగా మానివేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రవి రాజు, ఉపాధ్యాయులు శివశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రగ్గుల పంపిణీ

మోస్రా, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో బాలుర సంక్షేమ వసతి గృహంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 25 మందికి రెడ్‌క్రాస్ సభ్యులు సేకరించిన రగ్గులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తోట రాజశేఖర్ ఏడీఈ, రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఒక అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ విద్యార్థిని విద్యార్థులను చలి భారీ నుంచి కాపాడడానికి రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు రగ్గులు సేకరించి ఇప్పటి వరకు ప్రభుత్వ వెనుకబడిన బాలుర వసతి గృహాల్లో 900రగ్గులు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ వార్డెన్ చంద్రశేఖర్, స్థానిక విద్యుత్ సిబ్బంది శ్రీనివాస్, ఇలియాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్ని: వర్ని మండల కేంద్రంలోని సీసీడీ ఆవరణలో శనివారం నిరుపేదలకు 300 రగ్గులను పంపిణీ చేశారు. మాదాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలి తీవ్రత దృష్ట్యా ఈ రగ్గులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీడీ మేనేజర్ ఠాగూర్, లయన్స్ నగేష్, సుబ్బారావు, శివరాజు, కనక రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వేంకటేశ్వర స్వామి పల్లకి సేవ

జక్రాన్‌పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తొర్లికొండ గ్రామంలో శనివారం వేంకటేశ్వర స్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారు జామునుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవను కొండపై చుట్టు ప్రదక్షణలు చేయించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం ఆలయం వద్ద అన్నదాన కా ర్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ సంజీవ్ గౌడ్, బ్రాహ్మణ్‌పల్లి సొసైటీ చైర్మన్ కాటిపల్లి నర్సారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌పై ప్రజలకు అవగాహన

వేల్పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో శనివారం ఎన్నికల కోడ్‌పై గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ గంగాధర్‌రావు, నారాయణలు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ. 50 వేలకు మించి నగదు తీసుకెళ్లవద్దని అలా తీసుకెళ్తే ఇబ్బందులు తప్పవని సూచించారు. అలాగే వేలం పాట ద్వారా ఏకగ్రీవం చేస్తే కేసులు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతీ ఒక్కరు ఎన్నికల కోడ్ అతిక్రమించకుండా ఉండాలని సూచించారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

కోటగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోతంగల్, కోటగిరి మండలాల్లో శనివారం నామినేషన్ కేంద్రాలను ఎంపీడీవోలు చందర్, విష్ణులు పరిశీలించారు. సర్పంచ్, వార్డు స్థానాలకు చివరి రోజు కావడంతో నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు భారీగా గుమిగూడారు. సర్వర్ మొరాయించడంతో నామినేషన్ల స్వీకరణకు ఆలస్యమైంది. పోటీ చేసే అభ్యర్థులు 5 గంటల లోపు నామినేషన్ కేంద్రాల వద్దకు చేరుకుని తమ పత్రాలను సమర్పించారు. నామినేషన్‌ల స్వీకరణ రాత్రి వరకు కొనసాగింది.

ఆలూర్: మండలంలోని కల్లెడలో గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో గంగాధర్, ఎస్సై రాజ శేఖర్ శనివారం పరిశీలించారు. కేంద్రాల వద్ద ప్రాథమిక సదుపాయాలను, భద్రతా అంశాలు, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. పోలింగ్ రోజు నిర్వహణలో లోపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.


కల్లెడలో పోలింగ్ స్టేషన్లో పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్ , ఎస్సై రాజశేఖర్

సర్పంచ్ అభ్యర్థిగా రేఖ నామినేషన్ దాఖలు

నవీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నవీపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా శనివారం కేఎల్‌వీ రేఖ తమ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీతో ఆమె నామినేషన్ కేంద్రానికి తరలివెళ్లారు. రేఖ భర్త కేఎల్‌వీ రాజేందర్ గౌడ్ గతంలో నవీపేట ఎంపీపీగా పని చేశారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చట్టాలపై అవగాహన

మోర్తాడ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. వసతి గృహ సంక్షేమ అధికారి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్‌లు, పోలీస్ కానిస్టేబుల్ బాలాజీ చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

ఆర్మూర్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో సత్యనారయణ శనివారం పలువురు బాధితులకు సెల్‌ఫోన్లను అందజేశారు. ఇటీవల స్థానిక స్టేషన్ పరిదిలో పొయిన టువంటి సెల్‌ఫొన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వార సేకరించి నాలుగురు బాధితులకు అందజేశారు.

శ్రీనిధి బ్యాంక్ రుణాల రికవరీ వందశాతం ఉండేలా చూడాలి

జిల్లా నాన్‌ఫామ్ డీపీఎం రాచయ్య

కమ్మర్‌పల్లి, నవంబరు 29: (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధి కోసం అందజేస్తున్న శ్రీనిధి, బ్యాంక్ రుణాల రికవరి వందశాతం ఉండేలా చూసుకోవాలని జిల్లా నాన్ ఫామ్ డీపీఎం రాచయ్య అన్నారు. శనివారం మండల ఐకేపీ కార్యాలయంలో మమిసమాఖ్య సం ఘాల సమీక్ష సమావేశంలో ఆసరా పెన్షన్ డీపీఎం రాజేశ్వర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పెరడికోళ్ల పెంపకం 250 యూనిట్లు ఇదివరకే మంజూరికాగా అర్హులైన వారిని గుర్తించామని వారికి 2 వేల రూపాయల చొప్పు వారిఖతాల్లోకి జమకానున్నాయన్నారు. కాగా మండలంలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు మేకల పెంపకం యూని ట్లు మంజూరికాగా ఇందులో ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు గుర్తించడం జరిగిందని మిగిలిఉన్న ఎస్సీ యూనిట్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బ్యాలెట్ బాక్స్‌ల పరిశీలన

కమ్మర్‌పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) డిసెంబరు 17న మూడవ విడతలో జరగనున్న కమ్మర్‌పల్లి మండల గ్రామ పంచాయితీల ఎన్నికల నిర్వహన నిమిత్తం ఆధికారులు ఒక్కొక్కటిగా ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో రాజాశ్రీనివాస్ పరిశీలించారు. కాగా ఎన్నికల నిర్వహనలో చేపట్టాల్సిన నియమాలను వివరిస్తూ అవగాహన, శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో భద్రపర్చిన పోలింగ్ సామగ్రిని, బ్యాలెట్ బాక్స్‌ల పనితీరును ఎంపీడివో రాజా శ్రీనివాస్, ఎస్సై అనిల్ రెడ్డితో కలిసి పరిశీలించారు.

అయ్యప్ప ఆలయంలో కుంభాభిషేకం

నవీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప ఆలయంలో కుంభాభిషేక మహోత్సవం శనివారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా మొదటి రోజైన శనివారం భగవత్ ప్రార్థన, మహ గణపతి పూజ, పుణ్యావచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, గోపూజ, ధ్వజారోహణం, నవగ్రహ మండప దేవత కలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, లక్ష్మి గణపతి హోమం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

డీటీఎఫ్ బాల్కొండ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



ముప్కాల్ , నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డీటీఎఫ్ బాల్కొండ ఉమ్మడి మండల అధ్యక్షుడిగా ఒడ్నాల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం బాల్కొండ బాల్కొండలో జిల్లా ప్రెసిడెంట్ ఎం. బాలయ్య ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి ఎస్‌కే మదర్, ఉపాధ్యక్షురాలు శృతిమ, కార్యదర్శిగా విజయ్ కృష్ణ, జిల్లా కౌన్సిలర్‌గా ఎండీ నుస్రత్ ఎన్నికయ్యారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శాంతన్, రాష్ట్ర కౌన్సిలర్ పి. విజయ్‌కుమార్, దాసు, పెంటన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వణికించే చలిలో.. పంచాయతీ వేడి

- పొద్దుగాళ్ల నుంచే వీధుల్లో నేతల పర్యటన
- గ్రామాల్లో ఎలక్షన్ల సందడి



పంచాయతీ ఎన్నికల వేళ బరిలో నిలిచే ఆశావహులు పొద్దు పొద్దుగాళ్ల గ్రామంలో ప్రచారానికి కదులుతున్నారు. చలిలో సైతం సర్పంచులు, వార్డు సభ్యులుగా పోటీ చేసేవారు కాలనీలోకి వెళ్తున్నారు. ఎన్నడూ కనిపించని వారు వారి వారి కాలనీలలో ప్రత్యక్షం కావడంతో ఎటు వచ్చారు అన్న అంటూ పలకరిస్తున్నారు. అయితే ఓట్లు అడిగే వారు మాత్రం అన్నా బాగున్నారా అంటూ ఇంటి దగ్గరికి వెళ్లి ఓటర్లను పలకరింపులు మొదలయ్యాయి.

అబ్బా.. ఇప్పుడు గుర్తుకు వచ్చామా..

గీ అన్న గిప్పుడు వచ్చిండేంది. అసలు ఇటు ఎందుకు వచ్చినట్లు అని ఒకరినొకరు ముచ్చట్లు పెడ్తున్నరు. అరె ఓట్ల పండుగ గదుల్లో.. గెల్వనీకి ఓట్ల కోసం వస్తున్నరేమో అని మాట్లాడుకుంటున్నరు. ఇగ సదువుకునే పిల్లలతే అమ్మో ఆయనకు మనం ఇప్పుడు గుర్తుకు వచ్చామా అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నరు. ఇగ పోటీచేసేవారేమో ఎవరు ఏమనుకున్నా పర్వాలేదు ఓటేసి ఆదరించండి అంటూ ప్రచారం చేసుకుంటున్నారు.

ఆశపడ్డ వారికి కలిసిరాని రిజర్వేషన్లు

ఎన్నికలలో పోటీ చేస్తామని ముందు చూపుగా ఎంతో మంది సేవా కార్యక్రమాలు చేపట్టారు. సర్పంచి పదవిపై గురిపెట్టి సేవా కార్యక్రమాలు చేసిన వారిని రిజర్వేషన్లు కలిసి రాకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. గణపతులు, దుర్గాదేవి, బతుకమ్మలకు చందాలు ఇచ్చిన నాయకులు రిజర్వేషన్ దెబ్బతో సైలెంట్ అయ్యారు. అయినా ఎంపీటీసీలు, జడ్పీటీసీల రిజర్వేషన్లు కలిసివస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఏదేమైనా ఆశల పల్లకీలో ఉన్న నాయకుల భవిష్యత్తు అయినా బాగుంటుందన్న ఆశతో ఉన్నారు. - ఇందూరు, (ఆంధ్రజ్యోతి)

ఏకమయ్యారు.. ఏకగ్రీవం చేశారు


రామకృష్ణ
శాంకిబాయి
అనురాధ

కోటగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్కాస్‌పల్లి సర్పంచ్‌గా రెడ్డి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అడ్కాస్‌పల్లి నుంచి సర్పంచ్ స్థానానికి ఒకే ఒక నామినేషన్ దాఖలైంది. సర్పంచ్‌గా రామకృష్ణతో పాటు ఆరుగురు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండో పర్యాయం రెడ్డి రామకృష్ణ సర్పంచ్‌గా ఏకగ్రీవం కావడం విశేషం. ఇక ఇదే మండలంలోని రాంపూర్ సర్పంచ్‌గా శాంకిబాయిని గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు తీర్మానించారు. ఎస్టీకి రిజర్వ్ కాగా శాంకిబాయి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. 8మంది వార్డు సభ్యులు సైతం ఏకగ్రీవం అయ్యారు.

ఎడపల్లి: మండలంలోని బాపూనగర్ సర్పంచ్‌గా నగునూరి అనురాధను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇక్కడ ఎస్సీకి రిజర్వు కాగా అనురాధ ఒక్కరే నామినేషన్ వేశారు. సర్పంచ్‌తో పాటు గ్రామంలోని 8 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం అయ్యారు. కాగా వీరి ఎన్నికను ఎన్నికల అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది.

రాష్ట్ర సాధనకు పోరాడిన వీరులకు వందనాలు

- బాన్సువాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి బాజిరెడ్డి


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

బాన్సువాడటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెగించి పోరాడిన వీరులందరికీ వందనాలు చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శనివారం దీక్షా దివస్‌లో భాగంగా కొయ్యగుట్ట వద్ద గల అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారన్నారు. తాను సైతం 1969లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాని తెలిపారు. మలిదశలో తెలంగాణ వాదం మీద పార్టీలు ఏర్పాటుచేసినా అవి ప్రత్యేక తెలంగాణ సాధించలేకపోయాయన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి బీఆర్ఎస్ అధిక ప్రాధాన్యమిచ్చిందని, ఎక్కడా లేని విధంగా అభివృద్ధికి నిధులు కేటాయించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అధినేత కేసీఆర్‌ను మోసం చేశారన్నారు. ఇప్పుడు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా ఉండి రైతులకు న్యాయం చేయలేకపోతున్నారని మండిపడ్డారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను ఆయన ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరికలు


బీజేపీలోకి కండువా కప్పి ఆహ్వానిస్తున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే

పిట్లం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్నాపురం గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులు శనివారం జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతార సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ మేరకు వారికి మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ జుక్కల్ నియోజకవర్గంలో కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు రాము, మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, సతీష్ రెడ్డి, మోహన్ రెడ్డి, గోపాల్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి..


కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ నాయకులు

బాన్సువాడటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండలం కూనీపూర్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో నవీన్ రెడ్డి, సతీష్, దత్తు, మహేందర్‌రెడ్డి, బాలు, ప్రవీణ్ గౌడ్, శేఖర్, నరేశ్ ఉన్నారు.

మండలస్థాయి ఉపన్యాస పోటీలు


మాట్లాడుతున్న హెచ్ఎం

మద్నూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇంగ్లిష్ భాషా అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించడానికి ఈఎల్‌టీఏ మద్నూర్ ఆధ్వర్యంలో శనివారం జడ్పీహెచ్ఎస్‌లో మండల స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మల్లేశం మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, భాషా నైపుణ్యం, ప్రసంగ సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్యాదరి రాజేందర్, ఉపాధ్యాయులు శంకరయ్య, నాగయ్య, తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈఎల్‌టీఏ జిల్లా ప్రతినిధి రచ్చ శివకాంత్, కన్వీనర్ గడ్డివార్ నాగనాథ్, పీఆర్‌టీయూ నాయకుడు భీంరావు పాల్గొన్నారు.

‘యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేస్తున్నారు’



పీడీఎస్‌యూ మహాసభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లింబాద్రి

ఆర్మూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యూనివర్సిటీలను పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్, ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. శనివారం ఆర్మూర్ పట్టణంలో నిర్వహించిన పీడీఎస్‌యూ 23వ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యను ప్రోత్సహించడం వల్ల పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ యాజమాన్యాల కోసం ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులు ఇస్తూ ఉన్నత విద్యను పేద విద్యార్థులకు అందకుండా చేస్తున్నారని విమర్శించారు. సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే బాధ్యత పీడీఎస్‌యూ విద్యార్థుల మీదనే ఉందని ఆయన అన్నారు. శాతవాహన యూనివర్సిటీ, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వినాయక రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొఠారి కమిషన్ సిఫారు ప్రకారం విద్యకు సరిపడా నిధులు కేటాయించకుండా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. నూతన జాతీయ విద్యవిధానాన్ని తీసుకువచ్చి విద్యను కాషాయకరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గౌతమ్ కుమార్, ఆహ్వాన సంఘం అధ్యక్ష కార్యదర్శులు పస్క నర్సయ్య, పోచయ్య, మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి జి.రమేష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, అరుణోదయ నాయకులు దాసు, అబ్దుల్, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో ట్రాన్స్‌జెండర్


నామినేషన్ దాఖలు వేసినట్లు పత్రం చూపుతున్న ట్రాన్స్‌జెండర్ అంకిత

నవీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి శనివారం సాయంత్రం నామినేషన్‌ల ప్రక్రియ ముగిసింది. నామినేషన్‌ల దాఖలుకు చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున అభ్యర్థులు నామినేషన్ కేంద్రాలకు తరలివచ్చారు. నవీపేట గ్రామ పంచాయతీ 14వ వార్డు సభ్యురాలిగా గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ కొండపల్లి అంకిత నామినేషన్ దాఖలు చేసింది. 14వ వార్డు ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ అయింది. 2019లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సైతం అంకిత 14వ వార్డు సభ్యురాలిగా పోటీ చేసి 18 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ సందర్భంగా అంకిత మాట్లాడుతూ.. తాను వార్డు సభ్యురాలిగా గెలిచిన తర్వాత వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు తాగునీటి వసతి, వీధి లైట్ల ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. గ్రామాభివృద్ధికి సైతం తనవంతు కృషి చేస్తానని వివరించారు.


సంగంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న పరిశీలకులు

అభ్యర్థులు నిబంధనలు పాటించాలి

బోధన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా, వార్డు సభ్యులుగా నామినేషన్ వేసే అభ్యర్థులు తప్పకుండా ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలని పంచాయతీ ఎన్నికల పరిశీలకులు శ్యాం ప్రసాద్ లాల్ అన్నారు. అనంతరం బోధన్ తహసీల్దార్ విఠల్‌తో కలిసి బోధన్ మండలంలో ఎన్నికలు నిర్వహించే కేంద్రాలను సైతం పరిశీలించారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మండలంలోని పెంటాకలాన్ గ్రామ పంచాయతీతో పాటు డివిజన్‌లోని పలు గ్రామ పంచాయతీలలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. వీరితో పాటు ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేలు దాటితే సీజ్.. తనిఖీలు షురూ


వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

బోధన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని పోలీసు అధికారులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. బోధన్ డివిజన్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలు మొదటి విడతలో ఉండటంతో ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. బోధన్, సాలూర మండలాల అంతర్రాష్ట్ర రహదారిపై ఈ తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎక్కువ డబ్బులు తీసుకు వెళ్లవద్దని పోలీసులు చెబుతున్నారు. అత్యవసరం అయితే తప్ప రూ.50 వేలకు మించి డబ్బులు తీసుకువెళ్లవద్దన్నారు. అవసరమైతే వాటికి ఆధారాలు చూపాల్సిన అవసరం ఉందని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్ అమలులోకి వచ్చిన సందర్భంగా రూ.50 వేల వరకే వెంట తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుందన్నారు. అంతకంటే ఎక్కువ డబ్బు ఉండి దానికి సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోతే పోలీసులు సీజ్ చేస్తారన్నారు. తక్కువ మొత్తంలో దొరికిన డబ్బులు రెవెన్యూ అధికారుల వద్ద జమ చేస్తారన్నారు. అదే ఎక్కువ ఉంటే ఎన్నికల అధికారులు ఆదాయ పన్ను అధికారులకు సమాచారం అందించి కోర్టులో ఆ డబ్బులు జమ చేస్తారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నగదు రవాణాపై ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ప్రజలకు పోలీసులు సూచిస్తున్నారు. బస్సుల్లో సైతం పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. ప్రజలు ఎన్నికల కోడ్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైన ఉంది. శనివారం నగదు, మద్యం రవాణా చేయకుండా ఫ్లయింగ్ స్క్వాడ్ కెమెరాలతో తనిఖీలు నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది శ్వేత, కృష్ణ సురేందర్, రూరల్ సీఐ విజయ్‌బాబు పాల్గొన్నారు.


విద్యార్థులకు డెస్క్ బెంచీలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాఠశాలకు డెస్కు బెంచీల వితరణ

బీర్కూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు బీర్కూర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కాజా సునీల్ చౌదరి రూ. 2 లక్షల విలువైన విద్యాసామగ్రిని శనివారం పంపిణీ చేశారు. పాఠశాలకు 18 డెస్క్ బెంచీలు, 100 మంది విద్యార్థులకు బ్యాగులు, క్రీడా దుస్తులు, స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకన్న, ప్రధానోపాధ్యాయులు ప్రసన్నలత, రాధ కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులుకు పరామర్శ

వేల్పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మోతె గ్రామానికి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ తొగర్ల చిరంజీవులు మాతృమూర్తి మల్లుబాయి ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ లింబాద్రి, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కమిటీ కార్యదర్శి ప్రభాకర్, ఏఐయూకేఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవరాం శనివారం పరామర్శించారు. మల్లుబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చిరంజీవులును పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.


మల్లుబాయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

టీయూలో బీఆర్ఎస్వీ నాయకుల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఇందూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దీక్ష దివస్ కార్యక్రమ నిర్వహణకు అనుమతి ఇవ్వలేదంటూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ పరిపాలన భవనం ముందు శనివారం ధర్నా చేపట్టారు. వర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట దీక్ష శిబిరానికి సంబంధించిన టెంట్లు, మైక్‌లు తీసివేయడంతో ఆందోళనకు దిగా రు. ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్షదివస్ కార్యక్రమం శాంతియుతంగా జరుపుతుంటే మొదట అనుమతి ఇచ్చి తర్వాత నిరాకరించడం వెనక కాంగ్రెస్ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. డిసెంబరు 9 తర్వాత ప్రకటన లేకుంటే తెలంగాణ ఏర్పాటు అయ్యేదికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతటి నిర్బంధాలు విధించిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రజల పక్షాన పోరాటం సాగిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సంతోష్, నాగేంద్ర, నిరంజన్, లింగం యాదవ్, అశోక్ పటేల్, జక్కుల రాజేందర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమం


శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఇందూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని కూరగాయల మార్కెట్‌లో స్వచ్ఛతా మాస్ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. గంజ్ మార్కెట్‌లో వాలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొని ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అపర్ణ, జీజీ కళాశాల, సాంఘీక సంక్షేమ కళాశాల, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రోగ్రాం అధికారులు సురేష్, వెంకట్‌రమణ, సుధాకర్, నాగజ్యోతి, నరేష్, రజిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి


స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు


నాగిరెడ్డిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ నవోదయ సిద్ధార్థ అన్నారు. సంస్థ సభ్యులతో కలిసి శనివారం మండల కేంద్రంలోని కేరళ టాలెంట్ స్కూల్‌ను సందర్శించారు. విద్యాబోధనను పరిశీలించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే చదువు పైన దృష్టి సారించాలన్నారు. ప్రిన్సిపాల్ నిర్మల జిమ్మీ, సంస్థ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్ రావు, జిల్లా అధ్యక్షులు బోరంచ సాయిలు, బాబురావు, వికాస్ ,ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత నామినేషన్లు


నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయం

నాగిరెడ్డిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 27 గ్రామాలకు సంబంధించి సర్పంచ్, వార్డుస్థానాలకు రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రెండో వి డతలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి మండలంలో ఈనెల 30 (ఆదివారం) నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ఈ నెల 30 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు నామినేషన్ల స్వీకరణ జరగనుంది. మండలంలో 27 గ్రామ పంచాయతీలుండగా.. 27 సర్పంచ్ స్థానాలకు, 232 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు మండలంలో ఎనిమిది నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో లలిత కుమారి తెలిపారు. నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో, నాగిరెడ్డిపేట ఈ- పంచాయితీ కార్యాలయంలో, ఆత్మకూర్, బొల్లారం, ధర్మారెడ్డి, నాగిరెడ్డిపేట, మాల్తుమ్మెద, తాండూర్ గ్రామాల్లోని గ్రామ పంచాయితీల కార్యాలయ భవనాల్లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఆయా కేంద్రాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. మండలంలో 25,863 మంది ఓటర్లు ఉండగా అందవులో 12,032 మంది పురుషులు, 13,831 మహిళా ఓటర్లు ఉన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

మద్నూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మండలానికి సరిహద్దులో మహారాష్ట్ర నుంచి వస్తున్న వాహనాలను అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో మండలానికి సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. రెవెన్యూ పోలీసులు మహారాష్ట్ర నుంచి మద్యం అక్రమంగా డబ్బు రాష్ట్రంలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. శనివారం సరిహద్దులోని చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారి సంగమేశ్వర్, ఏఎస్ఐ ప్రభాకర్, సిబ్బంది యాదగిరి వాహనాలను తనిఖీ చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కోటగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ హెచ్చరించారు. పోతంగల్ మండల కేంద్రంలోని నామినేషన్ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు. ఎన్నికల వేళ సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వాక్యలు చేసినా, అనవసరమైన ప్రచారాలు చేసినా చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట రుద్రూర్ సీఐ కృష్ణ, కోటగిరి ఎస్ఐ సునీల్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్

సంక్షిప్త సమాచారం

ఆరోగ్య కేంద్రం తనిఖీ

సుభాష్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గౌతంనగర్‌లో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రంలోని ఐఎల్‌ఆర్, డీఫ్రిజర్‌లను పరిశీలించి వ్యాక్సిన్‌ల నాణ్యతను ఫ్రిడ్జ్‌లోని ఐస్‌ప్యాడ్‌లను పరిశీలించారు. వైద్య అధికారిణి డాక్టర్ మైత్రి, పర్యవేక్షకురాలు పుష్ప, సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండ మండలంలో పోలీసుల తనిఖీలు



గడ్కోలు రోడ్డువద్ద వాహనాలు చెక్‌చేస్తున్న దృశ్యం

సిరికొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ అధికారులు తనిఖీ చేస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని నలుమూలలా ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం వాహనాలను తనిఖీలు చేశారు. న్యావనంది చౌరస్తా, కొండూరు చౌరస్తా, గడ్కోల్ వెళ్లే రోడ్డు వంటి పలు ప్రధాన రోడ్లలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అక్రమంగా డబ్బు, మద్యం తరలిస్తున్నారా అని పరిశీలిస్తున్నారు. ఈ తనిఖీలను డిప్యూటీ తహశీల్దార్ గంగాధర్, ఐకేపీ సీసీ సత్యానంద్, కానిస్టేబుల్ దత్తాద్రిలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఈసీసీఈ డే

సిరికొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావుట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే నిర్వహించారు. శనివారం అంగన్‌వాడీ కేంద్రంలోని 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు నేర్పించిన ప్రీస్కూలు విద్య కార్యక్రమాల గురించి తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమం లో ఐసీడీఎస్ భీంగల్ ప్రాజెక్టు సీడీపీవో స్వర్ణలత, సెక్టార్ సూపర్‌వైజర్ సవిత, అంగన్‌వా డీ టీచర్ శాంత, తదితరులు పాల్గొన్నారు.

దూమపానానికి విద్యార్థులు దూరంగా ఉండాలి

» ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్

ఇందల్వాయి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దూమ పానానికి విద్యార్థులు దూరంగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్ అన్నారు. శనివారం ఇందల్వాయి మండల కేంద్రంలోని మాక్లూర్ తండాలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మద్యపానం, దూమ పానం తాగడం ఆరోగ్యానికి హానికరమన్నారు. క్యాన్సర్, గుండె పోటు లాంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తాజా ఆకుకూరలు, మొలకెత్తిన విత్తనాలు, నారింజ, నిమ్మ, క్యారెట్ లాంటివి ఎక్కువగా ఆహారంలో తీసుకోవాలన్నారు.

రోడ్డుపైనే పారేసిన నెలలు నిండని పిండం

సుభాష్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నెలలు నిండని పిండాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఖలీల్‌వాడి ప్రాంతంలో నెలలు ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి పడేసిన సంఘటన శనివారం వెలుగు చూసింది. రోడ్డుపైన వాహనాలు అటు ఇటు తిరుగుతున్న ప్లాస్టిక్ కవర్‌లో పిండం ఉండడాన్ని వాహనదారులు గమనించలేదు. అటుగా వెళ్లే స్థానికులు ప్లాస్టిక్ కవర్‌నుంచి నెలలు నిండని అవయవ భాగాలు బయటకు వెళ్లడాన్ని చూసి గమనించి 1వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల్లో పాల్గొనం

» ఊర చెరువు తండా వాసుల తీర్మానం



సమావేశమైన ఊర చెరువు తండా వాసులు

ధర్పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో తాము పాల్గొనమని మండలంలోని ఊర చెరువు తండా వాసులు ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు. శనివారం తండాలో సమావేశమైన వారు ఈ మేరకు సర్పంచ్ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు తీర్మానించుకున్నారు. అయితే మండలంలోని కాలేజ్‌తాండా, ఊర చెరువు తాండాలు కలిసి గ్రామ పంచాయతీలుగా ఏర్పడ్డాయి. మొదటిసారి గ్రామ పంచాయతీగా ఏర్పాటైన తొలిసారి సర్పంచ్‌గా కాలేజ్ తండాకు చెందిన అభ్యర్థిని ఏకగ్రీవంగా నిలబెట్టారు. గతంలోనే రెండు తాండాలు కలిసి ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. మొదటిసారిగా కాలేజ్‌తాండాకు సర్పంచ్ అవకాశం ఇవ్వాలని రెండవ సారి జరిగే సర్పంచ్ ఎన్నికల్లో ఊర చెరువు తాండాకు చెందిన వ్యక్తికి సర్పంచ్‌గా ఉండాలని రెండు తండాలు కలిసి ఏకగ్రీవంగా తీర్మానించుకొని ఒప్పంద పత్రాన్ని రాసుకున్నారు. అయితే ప్రస్తుతం తమ కాలేజ్ తండా సైతం ఎన్నికల్లో పాల్గొని తమ అభ్యర్థిని నిలబెడుతామని చెప్పడంతో వివాదం నెలకొంది. ఒప్పందం ప్రకారం ఊరచెరువుకు చెందిన అభ్యర్థికి సర్పంచ్ పదవి అవకాశం కల్పించాలని కాలేజ్ తండాకు చెందిన వారిని అభ్యర్థించారు. వారు ససేమిరు అనడంతో తాము సర్పంచ్ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు తీర్మానించుకున్నారు.

మద్దుల్ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా

» రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



ఎమ్మెల్యేను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

ధర్పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్దుల్ అటవీ ప్రాంతంలో వెలసిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల విరాళాన్ని అందజేశామని ఇకపై ఆలయ సర్వతోముఖాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. మద్దుల్ ఆలయంలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని విస్తరించి అక్కడే మండపాన్ని ఏర్పాటు చేసి పూజలకు, కల్యాణాలకు అనుగుణంగా చేస్తామన్నారు. డిసెంబర్ 4న జరిగే ఉత్సవాలకు హాజరై స్వామివారిని దర్శించుకోవాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్, గాదారి మనోహర్‌రెడ్డి, ధర్పల్లి సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున్, చెలిమెల నర్సయ్య, బేల్దారి కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు కాళేశ్వరం నీళ్లు ఇవ్వలేదు

» ఎస్సారెస్పీ పునరుజ్జీవం ప్రాజెక్టు ఇరిగేషన్ చరిత్రలో అత్యంత అవినీతి

» జాగృతి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌రెడ్డి



మాట్లాడుతున్న జాగృతి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌రెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి జిల్లాలకు ఒక్క ఎ కరానికి కూడా నీళ్లు ఇవ్వలేదని జాగృతి రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదన్న కవిత మాటలు ముమ్మాటికి నిజం అన్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ ప్రాజెక్టు ద్వారా 2.50 టీఎంసీల నీటిని ఎస్సారెస్పిలోకి ఎత్తిపోసారని ఆ తర్వాత ఎగువ నుంచి వరద రావడంతో ఎత్తిపోసిన నీళ్లు గోదావరిలోకి ఎల్లంపల్లి, అన్నారం బ్యారీలను దాటుకుని బంగాళఖాతంలోకి చేరింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. శ్రీరాంసాగర్‌ను కాళేశ్వరం నీళ్లతో నింపామన్న ప్రశాంత్‌రెడ్డి మాటలు ఎలా నిజం అని అన్నారు. కాళేశ్వరం ప్రా జెక్టు నిజామాబాద్ జిల్లాలో 1లక్ష 81వేల 349 ఎకరాలు, కామారెడ్డి జిల్లాలో 1లక్షల 86వేల 266 ఎకరాలు ప్రతిపాదించారని ప్యాకేజి 20-21,22 కింద వీటిలో ఏ ఒక్కటి పూర్తికాకపోవడంతో ఒక్క ఎకరాకు కూడా నీళ్లు రాలేదన్నారు. ఎస్సారెస్పి పునర్జివ ప్రాజెక్టు ఇరిగేషన్ చరిత్రలో అత్యంత అవినీతి ప్రాజెక్టు అని అన్నారు. ప్రశాంత్‌రెడ్డి రెండుసార్లు ఎన్నికల్లో గెలవడానికి కవిత కారణం కాదా అని ప్రశ్నించారు. జిల్లాకు 10ఏళ్లు మంత్రిగా ఉండి నువ్వేం చేశావో చెప్పాలన్నారు. ఈ సమావేశంలో సూదం రవించందర్, శ్రీనివాస్‌గౌడ్, విజయలక్ష్మి, శేఖర్‌రాజు, శంకర్, యెండల ప్రసాద్, ప్రవీన్‌కుమార్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఐహెచ్‌ఐపీ పోర్టల్‌పై శిక్షణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

సుభాష్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫాం పోర్టల్‌పై ప్రైవేట్ సిబ్బందికి శనివారం శిక్షణ శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని గంగాస్థాన్‌లో గల ఐ ఎంఏ హాల్‌లో ప్రైవేట్ ఆస్పత్రుల సిబ్బందికి శనివారం శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జి ల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభు త్వం తీసుకువచ్చిన ఐహెచ్‌ఐపీ పోర్టల్‌లో వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి ప్రైవేట్ ఆస్పత్రిలో ఫార్మసిస్టు, ల్యాబ్‌టెక్నీషియన్ ద్వారా సేవలు పొందే రోగుల వివరాలు పోర్టల్‌లో ఏవిధంగా నమోదు చేయాలో తెలిపారు. శిక్షణ పొందినవారు ఇకనుంచి ఫార్మసి ల్యాబ్ సేవలను పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో డా క్టర్ నాగరాజు, డిప్యూటి డిఎంహెచ్‌వో డాక్టర్ అశ్విణి, డీఈ డాక్టర్ శ్రావ్య, డాక్టర్ శిఖర, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మొదటి విడత..

(5వ పేజీ తరువాయి)

కాగా 1642 వార్డులకు గాను గురు, శుక్రవారాల్లో 382 నామినేషన్‌లు దాఖలయ్యాయి. శనివారం చివరి రోజు అర్ధరాత్రి వరకు నామినేషన్‌లు స్వీకరించడంతో నామినేషన్‌ల సంఖ్యపై స్పష్టతరాలేదు. ఆదివారం 5గంటల వరకు నామినేషన్‌ల పరిశీలన, 5గంటల తర్వాత అర్హులైన అభ్యర్థుల జాబితా ప్రకటించనున్నారు. సోమవారం అభ్యంతరాల స్వీకరణ, మంగళవారం 5 గంటలలోగా అభ్యంతరాల పరిష్కారం, బుధవారం నామినేషన్‌ల ఉపసంహరణ, అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉండే అభ్యర్థులను ప్రకటించనున్నారు.

నేటి నుంచి 2వ విడత నామినేషన్‌ల స్వీకరణ

2వ విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక కోసం ఆదివారం నుంచి నామినేషన్‌లు స్వీకరించనున్నారు. నిజామాబాద్ రెవెన్యూ డివిజన్‌లోని 7 మండలాలు, ఆర్మూర్ రెవెన్యూ డివిజన్‌లోని జక్రాన్‌పల్లి మండలంలో 2వ విడత ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 196 గ్రామ పంచాయతీలు, 1760 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. దర్పల్లి మండలంలో 22 సర్పంచ్, 194 వార్డు స్థానాలకు, డిచ్‌పల్లి మండలం 34 సర్పంచ్, 306 వార్డు స్థానాలకు ఇందల్‌వాయి మండలం 23 సర్పంచ్, 198 వార్డు స్థానాలకు, మాక్లూర్ మండలం 26 సర్పంచ్, 230 వార్డు స్థానాలకు, మోపాల్ మండలం 21 సర్పంచ్, 192 వార్డు స్థానాలకు నిజామాబాద్ మండలం 19 సర్పంచ్, 172 వార్డు స్థానాలకు, సిరికొండ మండలం 30 సర్పంచ్, 264 వార్డు స్థానాలకు, జక్రాన్‌పల్లి 21 సర్పంచ్, 204 వార్డు స్థానాలకు ఆదివారం నుంచి అధికారులు నామినేషన్‌లను స్వీకరించనున్నారు. 2వ విడత ఎన్నికల నామినేషన్‌లను స్వీ కరించేందుకు 59 క్లస్టర్‌లను ఏర్పాటు చేశారు. ఈ నెల 30 నుంచి డిసెంబరు 2వరకు నామినేషన్‌ల స్వీకరణ, డిసెంబరు 3న నామినేషన్‌ల పరిశీలన, అదే రోజు సాయంత్రం 5 గంటలకు అర్హులైన అభ్యర్థుల జాబితా ప్రకటన, డిసెంబరు 4న అభ్యంతరాల స్వీకరణ, 5, అభ్యంతరాల పరిష్కారం, డిసెంబరు 6న నామినేషన్‌ల ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటించనున్నారు. డిసెంబరు 14న ఉదయం 7 గంటల నుంచి మధ్యా హ్నం 1 గంటల వరకు 2వ విడత పోలింగ్, అదే రోజు సాయంత్రం ఫలితాలు ప్రకటించనున్నారు.

మహిళల చేతుల్లోనే గెలుపు 'కీ'..

(5వ పేజీ తరువాయి)

మహిళలకు అత్యధిక స్థానాలు దక్కాయి. 545 సర్పంచ్ స్థానాలకుగాను 244 స్థానాలు మహిళలకే కేటాయించారు. వందశాతం ఎస్టీ రిజర్వేషన్ కలిగిన గ్రామ పంచాయతీలలో మహిళలకు 33 స్థానాలు దక్కాయి. ఎస్టీ రిజర్వేషన్‌లలో 8, ఎస్సీ రిజర్వేషన్‌లో 35, బీసీ రిజర్వేషన్‌లలో 55, జనరల్ సీట్లలో 113 సీట్లు మహిళలకు కేటాయించారు. 5022 వార్డు స్థానాలకు గాను 2152 సీట్లు మహిళలకు దక్కాయి. వందశాతం ఎస్టీ రిజర్వేషన్ కలిగిన సీట్లలో 266, ఎస్టీ రిజర్వేషన్ సీట్లలో 98, ఎస్సీ రిజర్వేషన్ సీట్లలో 301, బీసీ రిజర్వేషన్ సీట్లలో 437, జనరల్ సీట్లలో 1050 సీట్లు మహిళలకు దక్కాయి.

డిచ్‌పల్లి మండలంలో అత్యధికం..

జిల్లాలోని డిచ్‌పల్లి మండలంలో అత్యధికంగా 25080 మంది మహిళా ఓటర్లు ఉండగా ఆ తర్వాత నవీపేట మండలంలో 24వేల 822 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. నందిపేట మండలంలో 22వేల 835 మంది, భీంగల్ మండలంలో 21వేల 87 మంది, వేల్పూర్ మండలంలో 20వేల 337 మంది, జక్రాన్‌పల్లి మండలంలో 19వేల 189 మంది, సిరికొండ మండలంలో 18వేల 142 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. స్థానిక ఎన్నికలు జరిగే 31 మండలాలలో అన్ని మండలాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండడం గమనార్హం.

రేవంత్‌రెడ్డి నుంచి తెలంగాణను కాపాడుకోవాలి

(5వ పేజీ తరువాయి)

పాత్ర ఏమిలేదని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతున్నాడని ఉద్యమ సమయంలో ఆయన ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధంలేనివారు రాష్ట్రానికి సీఎం, పీసీసీ ప్రెసిడెంట్ ఉప ముఖ్యమంత్రులయ్యారన్నారు. 2009 నవంబరు 29న కేసీఆర్ దీక్ష ఫలితంగానే కేంద్రం తెలంగాణ ప్రకటన చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. 1200 మంది విద్యార్థుల బలిదానాలకు కారణమైనందుకు సోనియాగాంధీకి పూల మాలలు వేయాలా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా కేసీఆర్ నిలబెట్టారని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. 37 జాతీయ పార్టీలను ఒప్పించి తెలంగాణ తెచ్చిన ఘనత కేసీఆర్‌దన్నారు. తెలంగాణ పదం పోవాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అంటున్నాడని కేసీ ఆర్ తెలంగాణ వేర్వేరు కాదని అన్నారు. అంతకు ముందు నగరంలోని వినాయక్‌నగర్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్ర మంలో అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్, బోధన్ నియోజకవర్గ ఇన్ చార్జి అయేషా ఫాతిమా పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

» రేపు బాధ్యతలు స్వీకరిస్తా

» డీసీసీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో జరగబోయే సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ వేనని, స్థానికసంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో ఎగిరేవి కాంగ్రెస్ జెండాలేనని, కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగిస్తుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఆయన నివాసంలో నగేష్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్‌రెడ్డి మాట్లాడుతూ డిసెంబరు 1న సోమవారం జిల్లాకేంద్రంలోని లక్ష్మీ కల్యాణ మండపంలో తన బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఉంటుందన్నారు. తనపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి, మహ్మద్ అలీ షబ్బీర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవంతో కిందిస్థాయి కార్యకర్త నుంచి ప్రతీఒక్కరిని కలుపుకుని పార్టీని బలోపేతం చేస్తానన్నారు. ప్రతీ కార్యకర్తకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. పార్టీ పటిష్ఠతకు శాయశక్తులా ప్రయత్నిస్తానని తెలిపా రు. జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్, ఏ ఎంసీ చైర్మన్ గంగారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

ముస్తాక్ అహ్మద్ సేవలు వెలకట్టలేనివి

» నుడా చైర్మన్ కేశ వేణు

నిజామాబాద్ సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సుదీర్ఘకాలం ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసి డీఈ ముస్తాక్ అహ్మద్ సేవలు అందించిన సేవలు మరువలేనివని నుడా చైర్మన్ కేశ వేణు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో మునిసిపల్ డీఈ ముస్తాక్ అహ్మద్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నుడా చైర్మన్ కేశ వేణు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బల్దియా అభివృద్ధికి, రోడ్లు, తాగునీటి సరఫరా, ఫిల్టర్‌బెడ్ వంటి ఎన్నో విభాగాలను విజయవంతంగా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రవీంద్రసాగర్ అడిషన్ కమిషనర్ రవీంద్రసాగర్, ఇన్‌చార్జి ఈఈ సుదర్శన్ రెడ్డి, రాంచరణ్, ఏఈ ఇనాయత్ కరీం, డిప్యూటీ కమిషనర్ రవిబాబు, టీపీఆర్‌వో రమేష్‌గుప్త పాల్గొన్నారు.

భారత మానసిక వైద్యుల సదస్సుకు హాజరైన డాక్టర్ విశాల్



అవార్డు అందుకుంటున్న డాక్టర్ విశాల్

సుభాష్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానసిక వైద్యుల సదస్సుకు జిల్లాకు చెందిన మానసిక వైద్యులు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విశాల్ హాజరయ్యారు. రాజస్థాన్‌లోని జోద్‌పూర్‌లో జరిగిన జాతీయ సదస్సులో ప్రత్యేక వక్తగా హాజరై మాట్లాడారు. మెదడులో ఆనందాన్ని కలిగించే జీవ రసాయణాలు అయిన సెలటోనియన్, డోపోమైన్ స్థాయిలు తగ్గడం వల్ల డిప్రెషన్‌కులోనై ఆత్మహత్య ఆలోచనలు వస్తాయన్నారు. ఈ రసాయనాలు పెంచే అధునాతన మందులతో చికిత్స చాలా ప్రభావవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ప్రమోద్, రియాజ్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

» రియాజ్ ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి

» పౌర హక్కుల సంఘం నాయకులు

నిజామాబాద్ సిటీ, న వంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో రియాజ్ చేతిలో మృతిచెందిన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని, పోలీసుల కస్టడిలో మృతిచెందిన రియాజ్ కుటుంబాన్ని ప్రభుత్వమే అన్ని విధాలా ఆదుకోవాలని పౌర హక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం నాయకులు మాట్లాడుతూ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించిన రియాజ్ సంఘటనపై సిట్టింగ్ హైకోర్టు జడ్జిచే విచారని జరిపించాలన్నారు.

మాలధారణం.. నియమాల తోరణం

(5వ పేజీ తరువాయి)

కంటే ముందే భక్తులు అయ్యప్ప దీక్షను స్వీకరించి స్వామి దర్శనంకై శబరి యాత్రకు బయలుదేరుతారు. మకరజ్యోతి దర్శనం కంటే ముందు అయ్యప్ప దీక్షను తీసుకునే భక్తులను చిన్నపాదంగా చెబుతారు. చిన్న పాదంలో తీసుకున్న భక్తులు 41 రోజులు మండల దీక్షను నియమనిష్టలతో పాటించి ఇరుముడితో శబరిమలైకి వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది.

పడిపూజలతో భక్తిని చాటుకుంటూ..

అయ్యప్ప భక్తులు మండల దీక్షలో పడిపూజ చేయడానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. మొట్టమొదటి సారిగా దీక్షను స్వీకరించే అయ్యప్పను కన్నెస్వామిగా పిలుస్తారు. కన్నెస్వామి దీక్ష తీసుకున్న వారు కనీసం 21 మంది భక్తులను తమ ఇంటికి పిలుచుకొని పడిపూజ నిర్వహించడం ప్రత్యేకంగా భావిస్తారు. అయ్యప్ప దీక్షలో కన్నెస్వామిని మొదలుకొని రెండు సంవత్సరాలు దీక్షను తీసుకునే కత్తి స్వామి, మూడు సంవత్సరాలు తీసుకునే గంట స్వామి, అటుతర్వాత గురుస్వామి, జ్యోతి స్వామి, సూర్యస్వామి, చంద్రస్వామి, త్రిశూలస్వామి, విష్ణుద్రస్వామి, శంకచక్రస్వామి, నాగాభరణ స్వామి, శ్రీహరిస్వామి, పద్మస్వామి పడిపూజ నిర్వహిస్తారు.

సినిమా గైడ్

దేవి : రాజు వెడ్స్ రాంబాయి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్: ఆంధ్రకింగ్ తాలూకా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : దేదే ప్యార్‌దే-2 (11.15, 9.15) బిజినెస్ మ్యాన్ (2.15, 6.15)
లలితామహల్ : సీసు రోడ్ ఆఫ్ రివేంజ్ (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : ఆంధ్రా కింగ్ తాలూకా (10.30, 1.30, 4.30, 7.35, 10.35)
స్క్రీన్-2 : రాజు వెడ్స్ రాంబాయి (11.00, 1.35, 4.30, 7.30, 10.20)
స్క్రీన్-3 : జూటోపియా-2 (ఇంగ్లీష్ 3డి) (11.00)
: తేరే ఇష్క్ మీన్ (హిందీ) (1.20, 4.20, 7.20, 10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : జూటోపియా-2 (తెలుగు 3డి) (11.00,1.30)
: ఆంధ్రా కింగ్ తాలూకా (4.00, 7.20, 10.40)
స్క్రీన్-2 : ఆంధ్రా కింగ్ తాలూకా (10.30, 1.50)
: రంగ్‌లీలా (హిందీ) (5.10)
: జూటోపియా-2 (ఇంగ్లీష్ 3డి) (8.10)
: రాజు వెడ్స్ రాంబాయి (10.40)
స్క్రీన్-3 : జనతాబార్ (10.30)
: తేరే ఇష్క్‌మిన్ (హిందీ) (1.10, 7.30, 11.00)
: బిజినెస్‌మెన్ (4.40)
స్క్రీన్-4 : తేరే ఇష్క్ మిన్ (హిందీ) (10.30)
: రాజు వెడ్స్ రాంబాయి (2.00, 4.50, 7.40)
: రివాల్వర్ రీటా (10.30)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,28,500	రూ.1,18,500	రూ.1750

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.270	రూ. 290



బస్సులో సీటు కోసం బంగారం ఉన్న బ్యాగు పోగొట్టుకున్న మహిళ

» గుర్తించి అందజేసిన పోలీసులు



బంగారం బ్యాగును అందజేస్తున్న పోలీసులు

సుభాష్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మీ పథకంతో మహిళలు బస్సులో సీట్ల కోసం పోటీపడుతున్నారు. ఖరీదైన వస్తువులు సైతం బస్సులో సీట్ల కోసం సీట్లలో ఉంచుతున్నారు. నగరంలోని ప్రధాన బస్టాండ్‌లో బోదన్ పట్టణానికి చెందిన సుగుణ శనివారం ఆర్టీసీ బస్సులో బంగారం, ఫోన్‌తో కూడిన బ్యాగును సీటు కోసం వేయడంతో ఆ బ్యాగు కనిపించలేదు. ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో బ్యాగు కనిపించకుండా పోవడం తో బ్యాగును పోగొట్టుకున్న మహిళ సుగుణ పోలీసులకు సమాచారం ఇచ్చింది. అక్కడే ఉన్న పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ ఫర్వేజ్, సెక్యూరిటీ గార్డు బస్సులో తనిఖీ చేసి సీటు కింద ఉన్నటువంటి బ్యాగును గుర్తించి అందులో ఉన్న 3 తులాల బంగారం, సెల్‌ఫోన్‌ను బాధితురాలికి అందజేశారు.

గంజ్ మార్కెట్‌లో స్వచ్ఛ భారత్



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి

మోపాల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ వ్యవసాయ గంజ్ మార్కెట్ యార్డులో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఫోరం అధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి విద్యార్థులతో కలిసి స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఇలాంటి కార్యక్రమంలో పాల్గొని ప్రతీ వార్డులో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టాలన్నారు.